ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 14-09-2026 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రఖ్యాత ఖైరతాబాద్ మహా గణపతికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు ఈ రోజు తొలి పూజ నిర్వహించారు. గణపతి ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు.

2. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని CM అధికారులను ఆదేశించారు.

3. ఈ నెల 17 న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్ పర్యటన కు రానున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ రోజు భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

4. హైదరాబాద్ కు భారీ వర్ష సూచనలు కొనసాగుతుండడంతో అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

-------------------------------

**ఖైరతాబాద్ గణేష్**

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 69 అడుగుల ఎత్తులో కొలువుదీరిన 'పంచముఖ సంకటహర మహాగణపతి'కి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తొలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... గణేశ్ ఉత్సవాలు మహారాష్ట్రలో ప్రారంభమైనప్పటికీ, ఖైరతాబాద్ గణేశుడి విగ్రహానికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 72 ఏళ్లుగా

ఇక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించడం విశేషమన్నారు. ప్రజలంతా గణపతి ఆశీస్సులతో సుభిక్షింగా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడు ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నింటినీ తొలగించి, రాష్ట్రంతో పాటు దేశమంతటా శాంతి, సమృద్ధి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. ఖైరతాబాద్ బడా గణేశుడి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తుండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**Desk**

-----------------------------

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగిపోయి, ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**HYD –PTC**

-----------------------------

**ఉప రాష్ట్రపతి పర్యటన**

ఈనెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను CRPF డిప్యూటీ కమాండెంట్ వికాస్ మోహన్ సింగ్, CRPF అసిస్టెంట్ కమాండెంట్ జితేంద్ర,

ఖైరతాబాద్ జోన్ డీపీసీ శిల్పవల్లి పరిశీలించారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు, ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు, చర్యలకు సంబంధించి పలు శాఖల అధికారులకు సూచనలు చేశారు. విమోచన దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్ లో సీపీ రాధాకృష్ణన్ ప్రసంగిస్తారు. ఈ వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు పాల్గొంటారు.

**ఎంఎస్ఎం**

--------------------------------

**వినాయక చవితి - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గణపతిని ప్రార్థించారు. మరోవైపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతికి ఎస్పీ మహేష్ బి.గితే, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ సహకరించాలని మండపాల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------------

**గణేష ఉత్సవాలు**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం

కలగకుండా పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పలు గణేష్ మండపాలలో జరిగిన పూజా కార్యక్రమాల్లో నల్లగొండ నగర ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.

**పీటీసీ - నల్గొండ**

-----------------------------------

**జనగామ**

వినాయక చవితి పర్వదినాన జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మానవతా దృక్పథంతో స్పందించి, ఓ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలిచారు. జనగామ మున్సిపాలిటీ పరిధిలోని వీవర్స్ కాలనీకి చెందిన మామిళ్ల పద్మ ఇందిరమ్మ పథకం కింద దరఖాస్తు చేసుకోగా సాంకేతిక కారణాలతో దశ పోర్టల్ లో ఇల్లు మంజూరు కాలేదు. అయితే ఈ విషయం తెలియని లబ్ధిదారు ఇల్లు మంజూరైందనే నమ్మకంతో అప్పు చేసి తన సొంత స్థలంలో ఇంటి బేస్‌మెంట్ నిర్మించుకున్నారు. ఆ తర్వాత కలెక్టర్ ను కలిసి మామిళ్ల పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ పరిశీలించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి ఈరోజు మామిళ్ల పద్మ ఇంటికి వెళ్లి ప్రొసీడింగ్స్‌ను అందజేశారు.

పీటీసీ, జనగామ జిల్లా

----------------------------------

**ముఖ్యమంత్రి పర్యటన**

ఈ నెలాఖరున సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు.. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కె.కె. మహేందర్ రెడ్డి తెలిపారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత కాంగ్రె స్ పార్టీకే దక్కిందని ఆయన అన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ ఆదేశాలతోనే

ఇటీవల అసెంబ్లీ గేటు ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైడ్రామా సృష్టించారని కె.కె.మహేందర్ రెడ్డి ఆరోపించారు.

**పీటీసీ, రాజన్న సిరిసిల్ల జిల్లా**

------------------------------

**పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ లో రాత్రంతా కురిసిన భారీ వర్షాలకు తోడు రెయిన్ అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, వాటర్ వర్క్స్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ద్రుష్టిలో ఉంచుకుని హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ క్యాచ్మెంట్ ప్రాంతాలతో పాటు మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జంట జలాశయాలు నిండే పరిస్థితి ఏర్పడితే గేట్లు తెరిచి మూసీ నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. గణేష్ మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**డెస్క్**

-------------------------------------

**జాబ్ మేళా**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న సూర్యాపేట జిల్లా కోదాడ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో సింగరేణి సంస్థ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా లో ఐటి, సేవా, నిర్మాణ, వాణిజ్య,

ఫార్మారంగాలకు చెందిన 300 కి పైగా కంపెనీలు హాజరుకానున్నాయని వెల్లడించారు. సుమారు నాలుగు వేల మందికి ఉద్యోగాలు దక్కే అవకాశముందని స్పష్టం చేశారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------------